# మణి

శ్రీమతి పెద్దిశెట్టి రామలింగారు

[మాధవరా వను ఆంగ్లవిద్యాధిక శ్రీమంతపుత్రుడు మణిని వివాహ మాడుదునని వాగ్దానమిచ్చి, పిమ్మట లీలను మోహించి, తరువాత తండ్రి మొగ మాటమున వసుంధర యను ప్లీడరుపుత్రికను కట్నమునకై పెండ్లియాడును. వసుంధర ఒక పుత్రుని పుత్రికను కని పతిచర్యలు సహించలేక రోగము పొంది మరణించును. తండ్రి చనిపోవును, తల్లి యిష్టమైనను మణిని వివాహమాడ మనును. అతను విద్యావతియగు లీలనే వివాహమాడును. ఆమె దూబరామనిషి, భర్తృసేవయం దభిలాషశూన్యము. తన ఆటలు మిత్రులు షోకులే ఆమె పని. ఒకనాడు ఆమె ఒక మిత్రునితో లేచిపోవును. మాధవునికి ఆచింతవలన జబ్బు చేయును. ఉన్నత ఆంగ్లవైద్యపరీక్షలో ఉత్తీర్ణయైన మణి అతని కిప్పుడు వైద్యురాలు. ఆపె అన్న కేశవరావు వసుంధర చెల్లెలు ఉపాధ్యాయినియగు శ్రీలత నిదివరకే మోహించెను.]

"మణీ అతనికి బాగుగా పశ్చాత్తాపము గలుగుట చేత మనోవ్యాకులత గలిగినది" అని కేశవరావు నుడివినాడు.

మణిని మాధవరావు జూచిన దగ్గరనుండి చాల విచారముగాయున్నట్లు ముఖభావమువలన కనిపెట్టి, "చెల్లీ! యే మట్లున్నావు. నాతో చెప్పవా?"

"సోదరా! నాస్థితి కనుక్కొన గోరుచున్నావు నీవు. ఆసభ జరిగిననాటినుండి అదోమాదిరిగా వున్నావు. నీ సంగతి నేను వినతగనా. చెప్పుము సోదరా. ఆతరువాత నేను చెప్పెదను."

"మణీ! నీకు చెప్పుటకు వెనుతీయుదునా! వసుంధర చెల్లెలగు శ్రీలతను జూచిన దగ్గరనుండి నా మనస్సు ఆమెపైకి పోయినది. ఆమెనుతప్ప మరెవ్వరిని చేకొనను. ఆమెకు నామీద ప్రేమ యున్నదో లేదో అని చింతగాయున్నది."

"అన్నా! నేను తప్పక ఆమె స్నేహము కలుగ చేసుకొని ఆమెకు నీయందు ప్రేమ జనింపజేసెదను" అని ధైర్యము కలుగునట్లు నుడివినది.

"మణీ! నీ సంగతి చెప్పుము."

"నేను చిన్ననాటనుండి మాధవుని ప్రేమించితిని. నన్ను కమలాకరునికి ఇచ్చి వివాహము చేసినారు గాని ఆయనయందు నా కిసుమంతయు ప్రేమ లేదు. సహోదరా! మాధవునిమూర్తి నా హృదయమున నిండియున్నది. నేను ఆయనకే నా హృదయమును అర్పించితిని" అని ఆమె విచారముతో పల్కినది.

"చెల్లీ! నీ వెందులకు విచారించుట? పూరుకొనుము. ఆయన నిన్ను చేసుకొనునటుల చేయుదును" అని చెప్పినాడు.

"అన్నయ్యా! అది అసాధ్యమైనపని. ఆయన విధవయగు నన్ను చేపట్టునా? పట్టిది."

1070

"లేదు! చెల్లీ! నీ వట్లు నిరాశ చేసుకోవలదు. విధవావివాహములు చాలా అవుచున్నవి."

"అన్నా! ఆయన వొప్పుకొనును అనుకోందును. నాన్నగారు, అమ్మ వప్పుకొందురా."

"నేను వొప్పుకొనునట్లు చేయుదును. నా కాపని వదలుము" అని పలికి వెడిలిపోయినాడు.

ఆదినము సాయంకాలమే శ్రీలతాదేవిని మణి కలుసుకొన్నది. శ్రీలత మణిని సగౌరవముగా ఇంటిలోనికి దొడ్కొనివెళ్లి కుర్చీచూపి ఆమె కూర్చొన్న తరువాత తాను కూర్చొన్నది. శ్రీలతతో ఆమాట యీమాట ఆడినతరువాత ఇంటివ్యవహారములు అడిగినది మణి. అక్క పెండ్లి, వాళ్లకష్టములు, తండ్రి చనిపోవుట, తండ్రి అంతిమసమయములో చెప్పిన మాటలు, సమస్తమును తెలియజేసినది. మణికూడ తన వివాహము తనకు సంభవించిన కష్టములు గురించి చెప్పినది. ఇద్దరుకూడ తమతమ ప్రేమగాథలు మరుగుపరచిరి. మణి కొంతసేపు ఆలోచించి శ్రీలతా! నా అన్నగారు నిన్ను ప్రేమించినారు అని మెల్లిగా చెప్పినది. ఆమెకూడ "మీతో నేనుకూడ చెప్పచున్నాను. మీ అన్నగారిని నేను ప్రేమించితిని" అని సిగ్గుతో పల్కినది.

మణి చాలసంతోషించి, శ్రీలత తల్లినిపిలిచి సమస్తము తెలియజేసి తనతో తెచ్చిన అన్నగారిఫోటోను చూపినది. ఆమెచూచి తనఅల్లుడు సౌందర్యవంతుడు కదాయని మురిసిపోయినది. కేశవుని సరళభావము దయార్ద్రహృదయము వినియున్నది గాన సంతోషించి "అమ్మా! శ్రీలతా! మీ నాయనగారు చనిపోవునప్పుడు చెప్పిరి వరశుల్కము పుచ్చుకొననివానిని చేసుకొనమని. అమ్మా! మణీ! మీ అన్నగారు కట్నం స్వీకరించనియెడల తప్పక ఇచ్చెదను శ్రీలతను" అనెను.

"అమ్మా! మా అన్నగారికి కట్నంఅన్న పరమఅసహ్యము. దానికి మీరేమి చింతపొందవలదు." అని ఆమెను సమాధానపరచి నేను వెళ్లెదనని తల్లి, కుమార్తలవద్ద సెలవుగైకొని ఇంటికివచ్చి, అధికానందముతో అన్నకు యీసంగతి తెలియజేసినది. తల్లిదండ్రులకుకూడ తెలియజేసినది. వారు చాల సంతోషించిరి.

ఒకనాటి సాయంకాలము మణి కేశవులు మాధవుని ఇంటికి వెళ్లిరి. కేశవరావు ఆమాట, యీమాటఆడి ఇప్పుడేవస్తాను, పక్కఇంట్లో ఒకకేసువున్నది, అని చెప్పి దాటివేసినాడు. మణిని మాధవుడు ఏమిప్రశ్నించుటకుతోచక, "మణీ! నీతండ్రిగారి పేరేమి?" అని అడిగినాడు.

"నాతండ్రిగారి పేరు ఆనందరావుగారు"

"ఏమి! ఆనందరావుగారి మణివా! నీవు, మణీ! ఎన్నిదినములకు నిన్ను నా యీపాపిష్టికన్నులతో చూస్తిని. నీకు పెండ్లిఅయినదని వింటిని నిజమేనా?"

"అవును" అని పెండ్లిఅయినదగ్గరనుండి నేటివరకు జరిగిన గాథ ఓపికతో చెప్పినది.

"మణీ! నీవు వరశుల్కముపేర బాగా యుపన్యాసమును ఇచ్చితివి. నేను చాలా దుర్మార్గముగా ప్రవర్తించితిని. నన్ను క్షమింపుము. ఇకనైనా నాతప్పలను మన్నించి నీవానిగాచేకొనుము" అని అతిదీనముగా వేడినాడు.

"ప్రభూ! నేను మిమ్ములను క్షమించుటా! మీరే నన్ను క్షమింపుడు."

మాధవరావు తల్లినిపిలిచి "అమ్మా నీమణి ఇదుగో అమ్మా!" అన్నాడు.

"ఆహా, ఎన్నిదినములకు నే చూస్తినమ్మా" యని అధికానందముతో బల్కినది. సుందరమ్మకు తన పెండ్లి తనచనువు, అన్నియు చెప్పినది మణి!

"అయ్యో! తల్లీ! ఇంతచిన్నతనములోనే నీవు భర్తనుగోల్పోయి విధవదానవు అయితివా?" అని



1071

కొంతసేపు విచారించి, "నాయనా! నీవు పెండ్లిచేసుకొన్న మణిని చేసుకొనుము. నాకేమియు అభ్యంతరము లేదు. యీనాటినాకైనా నా యీకోరిక తీర్చుము." అనెను.

"అట్లనే అమ్మ, మూర్ఖుడనై, పైసౌందర్యమునకు మోహపడి చేసుకొని, ఇంతవిచారమును తెచ్చుకొంటిని. యీనాటికి తెలిసినది. హృదయసౌందర్యము గాని, పైసౌందర్యముకాదు సౌఖ్యపెట్టునది."

సుందరమ్మ. మణిని లోనికితీసుకొనివెళ్లి వసుంధర పిల్లలను చూపినది. మణి వారినిఎత్తుకొని ముద్దాడి దించివేసినది.

ఇంతలో మణీ! అని పిలిచివాడు కేశవుడు. ఇద్దరు, తల్లి, కుమారునివద్ద సెలవుగైకొని వెళ్లిపోయిరి.

మాధవునికి తనకుజరిగిన సంభాషణఅంతయు అన్నకు తెలిపినది. ఇద్దరుకలిసి తల్లిదండ్రులవద్దకు జని జరిగిన సంగతి యావత్తు తెలియజేసిరి. వారుకూడ చాల సంతసించిరి.

ఆదినము సాయంకాలము మణి, శ్రీలతను వెంట నిడుకొని తల్లిదగ్గరకు తీసుకొనివచ్చి చూపినది. జ్ఞానాంబను మాటుటయేతడవుగ సాష్టాంగనమస్కారము చేసినది శ్రీలత. పతిదయకు పాత్రురాలవై సుపుత్రులనుబడసి చిరంజీవినివై వర్ధిల్లుమని దీవించినది. మణియు శ్రీలతయు చాలసేపు ముచ్చటించుకొనిరి. శ్రీలత మణివద్ద సెలవుగైకొని వెడలిపోయినది.

ఒకదినము సుముహూర్తమున శ్రీలతాదేవికి కేశవరావునకును, మణిదేవికి మాధవరావునకును, అతివైభవముగా వివాహముజరిగినది. మాధవుడు చాలఆనందము బొందినాడు.

ఒకదినమున మాధవుడు మణీ అని పిలిచినాడు. "ఏమి! ఎందులకు," అని అనుకుంటూవచ్చినది.

"కుర్చీమీదకూర్చో. ఒకకబురు చెప్పవలసియున్నది."

మణి కూర్చున్నది. గబుక్కునవచ్చి చక్కని ముద్దు పెట్టుకొని "మణీ! జ్ఞాపకము వున్నదా! 6 సంవత్సరముల క్రిందట మాట. నిన్ను కుర్చీమీదకూర్చోనబెట్టి చక్కని ముద్దుపెట్టుకొందునని చెప్పితిని" అని పకపకానవ్వినాడు.

"కబురు చెప్పతానని ఇదాపని. నేనుమాత్రం ఎప్పుడైనా బదులుతీర్చుకోనా! వుండండి మీపని చెప్తా"నని చెప్పి క్రిందకు దిగిపోయినది మణి.

## జీర్ణవటవృక్షము

శ్రీమతి వేదుల మీనాక్షీదేవిగారు

సీ॥ ఇనునైనఁ జొరనీనియిపుడు జొంపములతో నాకమంటెడి గొప్పశాఖలేవి
నికతంబుగూఁడులనీయందునిర్మించు కడురమ్యమౌ పతగంబులేవి
నెమరువేయుచుంగ నీనీడఁజేరెడు చక్కదనమొల్కు జంతుసంతానమేది
కాననంబులయందు కడుడస్సియుండి నీప్రాపుగోరినయట్టి పాంథులేరి

తే॥గీ॥ రంగురంగులతో కడు•రమ్యమైన|
పూర్వశోభను తలచుచు•పొగలిపొగలి|
ప్రౌఢువైపోతె•తుదకిటు•ముదివటంబ!
సకలమును జెల్లి అస్థిపం•జరమువోలె॥